# బస్సు కదిలింది

మధ్యాహ్నం పన్నెండు గంటలైంది.

నడివయసు సూర్యుడు నిప్పుతో చెలగాటాలాడుతున్నాడు.

మనిషి నిలువునా తగలబడిపోతాడేమోనన్నంత వేడిగా వుంది.

జోళ్ళున్నా కాళ్ళు కాలిపోతున్నాయి.

ఆకలికి కడుపు కాలిపోతోంది.

ఎండకీ, ఆలోచనలకీ బుర్ర కాలిపోతోంది!

మా వారిమీద కోపంతో గుండె కాలిపోతోంది.

మొత్తానికి నేనొక అగ్నిపర్వతంలా వున్నాను. "ఇంత ఎండలో బస్సు ప్రయాణ వేఁవిఁటే, నా మొహం" విసుక్కున్నాడు శీను. వాడికి బస్సంటే భయం. ఎండంటే ఎలర్జీ. కాని మా వారి మాట సుగ్రీవాజ్ఞ. ఏ భయం అయినా, ఎన్ని ఎలర్జీలైనా ఆయన మాటకి లొంగాల్సిందే. ఈయన క్రితం జన్మలో హిట్లరో, ముసోలినీవో అయివుంటారని నా గట్టి నమ్మకం.

"అభిజిత్ లగ్నం అమోఘమైనది. ఏ పనికైనా తిరుగుండదు"- మా మావఁగారి ఉవాచ.

నాకు నవ్వొచ్చింది. అంత పెద్ద పేరెందుకూ, ఉప్పరి లగ్నం అంటే సరిపోదా? ఇంతకీ అది ఎంత అమోఘమైనదైనా నడిరోడ్డుమీద నిల్చోడానికి మాత్రంకాదు. కాని ఏం చేస్తాం. మా వారు హిట్లరు అవునో కాదో కాని యీాయన మాత్రం సాక్షాత్తూ హిరణ్యకశిపుడే.

వేసవికాలం మధ్యాహ్నం పన్నెండు గంటలకి బస్సు కోసం వెయిట్ చెయ్యడానికి యింకే శిక్షా సాటిరాదు.

ఎదురుగా గోడమీద కూర్చున్న కాకిపిల్ల- నోరెండిపోయిందేమో - నా నుదుటిమీద నుంచి కారిన చమటవేపు ఆశగా చూస్తోంది. పక్కనే సోడాబండి కింద కారుతున్న నీటిలో రెండు పిచ్చికలు సరిగంగ స్నానాలు చేస్తున్నాయి.

యివేళ, రేపు ఏదైనా లగ్నం వుందా? ఏఁవిఁటీజనం?

"యీ జనమంతా మన బస్సుకే!" పైకే ఆశ్చర్యపోయేడు. "కాదు. ఆర్. టి. సి. బస్సుకి" అన్నాడు శీను. వెధవ కుళ్ళుజోకులూ వీడూను.

"కొన్నాళ్ళు వారపత్రికలు చదవటం మానీరా" అనే దాన్ని యీ కొకప్పుడైతే. కాని యిప్పుడీ ఎండలో ఏవనిపించలేదు తన్నడం మినహా. తన్నేదాన్నో లేదో తెలీదు కాని యీలోగా ఝుయ్యిన దూసుకు వచ్చేసింది మా బస్సు. బ్రేకులులూజో, డ్రైవరు కొత్తవాడో కాని ఆగాల్సినచోటుకి

అరఫర్లాంగు దూరంలో ఆగింది. ఆడ మగ తేడాలేకుండా అందరం పరిగెత్తేం. మామూలుగా అయితే కొంత వయస్సున్న ఆడవాళ్ళు రోడ్డుమీద పరిగెత్తరు. బహుశా సిగ్గుకీ సమయం, సందర్భం వుంటాయేమో.

"తప్పుకో బాబూ. పిల్ల కాలుండిపోనాది. ఆఁ ఆఁ ఎక్కనియ్యవేఁటి?"

"ఉండవమ్మా. దిగనీవేఁటి? దిగక బస్సులో వుండిపోతావేఁటి?"

"ఎవరూ వుండిపోరు. అంతా పోయేవాళ్ళవే. తప్పుకో"

"ఆ మాట ఏటమ్మా... వంకాయలా...లగేజవుద్ది... మనుషులకే చోటులేక ఛస్తావుంటే మాటలేఁవిఁటమ్మా, పైన ఏయించు. పైన."

ప్రయాణంమాట దేవుఁడెరుగుగాని! బతికి బస్సు దిగుతానా అనిపించింది ఆ జనం తొక్కిడి చూస్తే. చిన్నప్పుడు చెట్లెక్కడం అలవాటున్నదాన్ని కాబట్టి ఎలాగైతేనేం కాలి వేలొకటి పచ్చడి చేసుకొని, చీర ఓ అరగజం చింపుకొని బస్సులో పడ్డాను. చిన్నప్పుడు స్కూళ్ళలో ఎన్. సి. సి. లు వగైరా ట్రైనింగు యిచ్చినట్టే బస్సెక్కడం, దిగడంకూడా ఎందుకు ట్రైనింగు యివ్వకూడదూ?

నేను బస్సెక్కడం, బస్సు స్టార్టవడం, ఆ కుదుపుకి నా తల యినుపకడ్డీకి రపీలుమని కొట్టుకోవటం లిప్తకాలంలో జరిగిపోయేయి. ఎక్కడా సీటు ఖాళీవున్నట్టులేదు. భగవాన్! యీ

ఎండకితోడు యిలా నిల్చునే వుండాలి కాబోలు. అన్నట్టు శీను ఏడీ? ఎక్కేడో లేదో? డబ్బు, అవసరమైన కాయితాలు వాడిదగ్గరే వుండిపోయేయి. 'టికెట్ టికెట్' అంటూ మాల కాకిలా అరుస్తున్నాడు కండక్టరు. సగంతోవలో దింపేస్తాడో ఎంవిటో? యీ శీనుగాడు కనిపించడే.

"ఓ సారి బస్సు ఆపుతారా?" గట్టిగా అరవాలనుకున్నాను. "ఓ సారి బండి ఆపుబాబూ" గట్టిగా వినిపించింది. అరిచింది నేను కాదు. అదుగో ఆ వెనక ఆవిడ. నేను అనాలనుకున్నమాట ఆవిడకెలా తెలిసిందో? టెలిపతీ కాదు కదా?

"వలా మొగోడు దిగడిపోనాడు. కాస్త బండి ఆపు బాబూ" అంటూ అరుస్తోందావిడ. ఆవిడ గుండు మహా బావుంది. స్వాములారికి చీర కట్టినట్టుందావిడ.

హోల్డాన్... హోల్డాన్...

బస్సాగింది.

"నువ్వేటమ్మా తల్లీ. చంపేశావ్. చూడండి సార్ వీళ్లు తిరపతిలో ఎక్కేరు. ప్రతి స్టేజిలోను అతను దిగి పారిపోతాడు. ఎప్పటికీ రాడు. యీ యమ్మేమో ఆపండాపండని అరుపులు. యిలాగైతే వెళ్ళినట్లే బండి. మేమెప్పుడైనా కాఫీ వేడిగా వుంది కాస్త ఆలీశం అయితే అరవై అర్జీలు... ఏవమ్మాయ్. యీసారిగనక అతను దిగితే నిన్నూ, సామాన్నీ కిటికీలోంచి యిసిరేస్తాను... ఏడీఅతను...." కండక్టరు కస్సుమంటున్నాడు.

"ఇదిగో ఇక్కడే" అన్నట్టు తలుపు తీసుకొని పరిగెత్తు

కుంటూ బస్సెక్కేడు ఆ మొగోడు. అతని రెండు చేతులమధ్య స్టీలు గ్లాసుంది. ఆ గ్లాసుకి కిందా పైనా కాయితమ్ముక్కలున్నాయి. బ్రహ్మరాక్షసుడి ప్రాణాలున్న చిలకని పట్టుకొస్తున్న జానపద హీరోలా అతనా గ్లాసుని అతి భద్రంగా పట్టుకున్నాడు. బస్సులోకూడా పరిగెత్తడంవల్ల ఆ గ్లాసులోని ద్రవాన్ని చుట్టూవున్న వాళ్ళందరిమీదా శుద్ధి చెయ్యడానికి పసుపునీళ్ళు జల్లినట్టు జల్లుకుంటూ వెళ్ళేడు.

“ఏవయ్యోయ్! నిన్నే .... ఆఁ ఆఁ రైట్ రైట్... మళ్ళీ యింకోసారిగాని దిగేవంటే మరింక నేను మంచోడ్ని కాను. తెలిసిందా....ఇదేం నీ మామగారి బస్సనుకున్నావాఁ? అయినా అలా స్టేజి స్టేజికీ కాఫీ తెస్తావు. అదేం కడుపా? కాఫీ హోటేలా? రైట్...రైట్...”

బస్సు కదిలింది.

“టికెట్...టికెట్...చిల్లర తెచ్చుకోకుండా బండెందుకెక్కుతారయ్యా! నేనేం చిల్లర దుకాణం పెట్టేనా? సర్లే....” అన్నట్టు యీ సీను ఏమైనట్టు? ఈసారి నేను బస్సాపమంటే నాకూ అన్ని అక్షింతలూ పడతాయేమో! చుట్టూ చూశాను. అల్లదుగో వెనకాల సీట్లో కూర్చుని చెయ్యూపేడు. “ఖాళీ ఉంచేను రమ్మని” అమ్మయ్య యీ ముహూర్తం మంచిదే, కూర్చోడానికి సీటు దొరికింది. అడ్డుగావున్న అరటిపళ్ళ గెల మీంచి గెంతబోయి పక్కనున్న అతని పాదం తొక్కేసి,

'సారీ' చెప్పుకొని సర్కస్ చేసి ఎలాగో మొత్తానికి సీట్లో కూలబడ్డాను.

"దెబ్బ తగిలిందేవిఁటీ?" పరామర్శించేడు నుదురు తడుముకుంటూంటే.

"లేదు" అన్నాను రోషంగా నా దెబ్బకి కారణం వాడే అయినట్టు ఠక్కున తడుముకోడం ఆపేసి.

ముందుసీట్లో కూర్చున్నతను ఫుల్‌సూట్‌లో వున్నాడు. ఏదైనా ఇంటర్వ్యూకి వెళ్తున్నాడేమో! ఏమైనా ఆ టైములో, బస్సులో సూటుని భరిస్తున్న అతని దగ్గర, తొడుపురుగు డోలి చేస్తూన్నా ఓర్చుకున్న కర్ణుడు తీసికట్టే. కిటికీలోంచి వీస్తున్న గాలి చెమటకి తగిలి ప్రాణం ఒక్క నిమిషం హాయనిపించింది.

ఈ పక్క కిటికీ దగ్గర కూర్చున్నావిడ చుట్టపెట్టిన డన్‌లప్ పరుపులా వుంది. ఆవిడ పక్కన కూర్చున్నతను ఆవిడ మొగుడే అయితే...భయంకరం ఆవిడ తీసే ఊపిరి చాలు అతను సుడిగాలిలో గడ్డిపరకలా ఎగిరిపోడానికి. అంతసన్నంగా, ఎండుగా, వి త్తనం బీరకాయలా వున్నాడు. "టికెట్టులు... తీసుకున్నారా..." సందేహంలేదు, మొగుడే. గోదావరి ఎక్స్‌ప్రెస్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్, తమిళనాడు ఎక్స్‌ప్రెస్ కలిసి కోరస్‌పాడితే యింతకంటె యింపుగానే వుంటుంది.

అంత చికాకులోను నాకో పాడు ఆలోచన వచ్చింది. "ఈవిడ కడుపుతో వుంటే ఎలా వుంటుందో?"

"ఉండదు" అన్నాడు శీను సీరియస్‌గా.

మూడోసీట్లో కూర్చున్న ముసలమ్మ డబ్బు తియ్యడానికి నానా అవస్థా పడుతోంది.

ఆవిడ చర్మం ఎండిపోయిన చెట్టు బెరడులా వుంది. మనిషి ఎముక, తోళ్క కసిలి ఏడు కిలోల బరువుంటుంది. పుట్టిన తరవాత ఒక్క సుఖమూ ఎరుగని దానిలా అతిదీనంగా వుంది. బస్సు కుదుపుకో, ముసలితనంవల్లో ఆవిడ చేతులు వణుకుతున్నాయి. కొంగుముడి విప్పడానికి పట్టు దొరకడం లేదు.

అయినా అదేం బస్సు! పోరూము వదిలేక ఎప్పుడూ ఉంచాడు ఆయిలు ఎరగనట్లుంది పరిగెడుతున్న పిండిమిల్లులో కూర్చున్నట్లుంది.

"తొరగా తియ్యి మామ్మా.... ఎక్కడి కెళ్లాల?"

ఈ కండక్టరెవడోగాని మహానుభావుడు ఎప్పుడూ మొహం చీమల పుట్టలా పెట్టాడు. ఇతన్ని కట్టుకున్న యిల్లాలెవరోగాని ఏ ఉమ్మెత్తపువ్వుల పూజచేసిందో! మానవుడు. పుట్టి నవ్వి ఎరగడు.

"మంగళగిరి" మూలిగిందా ముసల్ది. బతికున్న మనిషి గొంతుకలా కాకుండా ఎక్కడో ఏడు నిలువుల లోతున పాతిన శవం మూలుగులా వుంది.

"హోల్డాన్.... హోల్డాన్" తేలుకుట్టినట్టు అరిచేడు కండక్టరు.

మళ్ళీ బస్సాగింది.

"ఇది మంగళగిరిలో ఆగదమ్మా, దిగు దిగు."

అప్పటికి ఊరు దాటి దగ్గర దగ్గర రెండుమైళ్ళు వచ్చేశాం. ఇప్పుడిక్కడ దింపేస్తే ఆ ముసిల్దాని గతేమిటి?

బస్సులో అందరూ ఆమెవేపే చూస్తున్నారు.

"ఇది ఎక్స్‌ప్రెస్, ఆగదు" అన్నాడు కండక్టరు బస్సుదే తప్పైనట్టు.

"ఏలా?" గొణుక్కుంది.

"అయినా బస్సెక్కేముందే చూసుకోవద్దూ" అన్నాడొకడు.

"ఎవరైనా అడగొచ్చుకదా, అనవసరం లేటు" విసుక్కున్నాడొకడు.

"దిగు, దిగు" అంటూ తలుపు పట్టుకొని నిల్చున్నాడు కండక్టరు.

ఏం చెయ్యాలో తెలీని ముసలమ్మ గాభరాగా నిల్చుంది.

పాపం! ఏ పిల్లకి ప్రమాదంగా వుండి వెళ్తోందో? ఎంత అవసరం లేకపోతే ఆ వయసులో ఈ ఎండలో బయల్దేరుతుంది?

"మంగళగిరిలో కొంచెం స్లోడౌన్ చెయ్యండి, దిగిపోతుంది" అన్నాడు సడన్‌గా శీను, అంతవరకు ఎటో చూస్తున్నవాడల్లా యిటు తిరిగి.

"ఎవడో సినీమా హీరో" అన్నట్టు చూశారు బస్సులో అందరూ మా వేపు.

"అసలు మంగళగిరికి టికెట్టు కొయ్యడానికి వీల్లే

ద్సార్" అన్నాడు విసుగ్గా కండక్టరు, "ఎవడీ క్లాస్ కిస్కా గాడ"న్నట్టు.

"అయితే విజయవాడ కే తీసుకో డబ్బు" అంటూ జేబు లోంచి డబ్బు తీశాడు శీను.

"ఆ థేంక్స్యారా అబ్బీ! థేంక్స్యా" అనుకున్నాను.

బస్సు మళ్ళీ కదిలింది.

బయట ఎండకి, బస్సువేడికి ఒళ్ళంతా జ్వరం వచ్చినట్టయిపోయింది.

"అసలు యీ లేడీసు వున్నా రే......" కంచుగంట మాట్లాడినట్లైంది. అప్పుడు చూశాను డ్రైవర్ని. ఏమి Style! ఆ మధ్య రిక్షావాళ్ళకి రిక్షాలు పంచినప్పుడు కలక్టరు రొక రిక్షాతొక్కుతున్నట్టు ఫొటో పడింది. అదిగో ఆ కలక్టరుగారు స్టయిల్‌గానే వున్నారు. బహుశా ఇతను చిన్నప్పుడు కాన్వెంటులో చదివుంటాడు. అతని అమ్మ నాన్న బావున్న రోజుల్లో, ఇతన్ని గురించి ఐ. ఎ ఎస్. కలలు కనే రోజుల్లో కాన్వెంటుకి పంపించి వుంటారు. రోజులు మారిపోయి, అమ్మ, నాన్న చెల్లిపోయి డ్రైవరై వుంటాడు.

—ఈ లేడీసు—చంపుకు తినేస్తారంటే నమ్మా. బస్సెక్కడం రాదు, దిగడం రాదు, డబ్బులివ్వడం రాదు. ముప్పావలాకి ముప్పైమూడు ముళ్ళు. లారీడు లగేజీ, చంకన పిల్ల, చేతిలో పిల్ల, కడుపులో పిల్ల, ఓ టికెట్టుకి నలుగురు—" అంటూ యింతమంచి జోకు యీ మధ్య ఎవరూ వెయ్యనట్టు

విరగబడి నవ్వేడు. నవ్వి ఒకసారి వెనక్కి తిరిగి చూశాడు, మేమంతా వింటున్నామో లేదోనని. వింటున్నామన్న నమ్మకం కుదిరేక మళ్ళా ప్రారంభించేడు.

"—అసలీళ్ళకి బొత్తిగా కామన్ సెన్సు లేదు గురూ! డౌటు లేదు. ఇతను కాన్వెంటు వెలగబెట్టేడు - బస్సు చూడగానే ఎద్దులాగ బెదిరిపోతారు. పరుగులు, పర్సులు పారేసుకోవడం, కోకలు చింపేసుకోవడం—అయినా ఈళ్ళకి ఢిల్లీలోలాగ సెపరేట్ బస్సు లెయ్యాల. ఏటంటావ్—"

అవునన్నట్టు తలాడించేడు యింజనుమీద కూర్చున్న తుప్పజుత్తువాడు.

"—మరీ ఈ మధ్య దేశంలో యింతమంది ఆడవాళ్ళు ఎక్కువైపోయేరేటి? సినిమా హాలుకాడ, కాఫీ హోటల్లో, రైళ్ళల్లో, బజార్లో, ఎక్కడ చూడు లేడీసు—అసలు ఆడదం టేనే అసహ్యం వచ్చేస్తోంది. ఇదేదో మహిళా ఏడాదో ఏదో నట. ఇంక చూడు యీళ్ళకి మరీ తిరుగుడెక్కువైపోయింది. మొగోడు సంపాయించి తెస్తే తిని తొంగోక ఎందుకొచ్చిన తిరుగుడు" అంటూ యింక ఈ తిరుగుడు చాలన్నట్లు కేరుమంటూ బస్సాపేసేడు. ఆపి పక్కన కిందకు గెంతేసేడు.

చుట్టుపక్క లెక్కడా ఊరులేదు. మరెందుకాగినట్టు? ఇంజను అంటుకు పోయిందా? బ్రేకులు వదిలేశాయా? కొంప తీసి "పాసింజరు మహాశయులారా!" అంటూ నిల్చుని స్పీచ్ యివ్వడుకదా! థేంక్ గాడ్ యివ్వలేదు.

"ఎవరండీ బాబూ ఆ సిగరెట్టు కాలుస్తున్నది. తొరగా కాల్చేస్తేగాని బండి బైల్దేరదు" కండక్టరు బాబు వివరించేడు.

సంగతేమిటంటే ఆ కాన్వెంటు డ్రైవరుకి సిగరెట్టు వాసన పడదు. అతనా వాసన అరమైలు దూరంనుంచే ఆఘ్రాణించి పసికడ్తాడు. భేష్! బావుంది.

కాలుస్తున్న సిగరెట్టుని అటూ ఇటూ తిప్పుతూ, ఆలోచిస్తున్నాడు శీను. వాడికి బస్సెక్కిన దగ్గర్నుంచీ వేంవేళ్ళు వాడిలా వాంతులవుతాయి. ఇలాంటి ఎమర్జెన్సీలకి రెండు సిక్విల్ వేసుకొని బస్సెక్కిన దగ్గర్నుంచీ దిగేవరకు ఆగకుండా సిగరెట్లు కాల్చేస్తాడు.

అందరూ మా వేపే చూస్తున్నారు మహాపరాధం చేసినట్టు.

ఆ క్షణంలో గనక డ్రైవరు అక్కడ వుండి వుంటే శీను చూపుకి మసి అయిపోయి వుండేవాడు.

"సారీరా" అన్నాను నెమ్మదిగా.

బస్సు మళ్ళీ కదిలింది.

ఈసారి దేవుడి దయవల్ల డ్రైవరు స్పీచ్ యివ్వలేదు. బహుశా సిగరెట్టు వాసనకి అతని మూడ్ పాడైపోయివుంటుంది. అందరూ టికెట్లు తీసేసుకున్నారు కూడా. బయల్దేరినప్పుడున్న ఎండంతా ఏమైపోయిందో అకస్మాత్తుగా నల్లటిమేఘం కమ్మేసింది. వర్షంకూడా వస్తుందేమో! అందుకే వాన రాకడ ప్రాణ పోకడా తెలీదంటారు. ఎక్కడో దూరంగా వర్షం పడిందన్న సూచనగా చల్లటిగాలి వీస్తోంది. మేఘంవల్ల వెల్తురులేక అప్పుడే చీకటి పడ్తోందా అన్నట్టుండడంవల్ల పక్షులన్నీ గబగబా

ఎక్కడి మేతలక్కడ వదిలేసి గూళ్ళకి చేరుతున్నాయి. ఎంత దృష్టవంతులు అవి, మనుషుల్లాగా వాచీకి అంకితం అవలేదు వాటికి బతుకులు!

వచ్చేజన్మలోనైనా పక్షినైతే బావుణ్ణు!

వచ్చేజన్మ మాట దేవుడెరుగుగాని ఈ జన్మంతా ఈ బస్సులోనే గడిచిపోయేటట్టుంది అనిపించింది మళ్ళీ బస్సాగే సరికి. మళ్ళీ ఏమొచ్చింది?

రైల్వేగేటు వేసేరు. గేటు కిటు అటు ఆగిన ట్రాఫిక్ అరమైలు పైనే వుంటుంది. అన్ని బస్సుల్లోవాళ్ళు దిగి రోడ్డు మీద అదేదో తిరణాలలాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. కార్లలోవాళ్లు మాత్రం దిగకుండానే మాట్లాడుకుంటున్నారు. మా బస్సులోకూడా ఆడవాళ్ళు, డ్రైవరుతప్ప అంతా దిగేరు సిగరెట్లు కాల్చుకోవడానికీ, సోడాలు తాగడానికీ. శీను దిగకుండానే సిగరెట్టు అంటించి విజయగర్వంతో ఓసారి డ్రైవరు వేపుచూసి ఫర్లాంగు దూరం వదిలేడు పొగ. గబుక్కున గెంతేసేడు డ్రైవరు ఆ పొగకే తను అంటుకుపోతానేమో నన్నంత గాభరాతో.

ఏదో గొణిగాడు శీను.

"ఏవిట్రా?"

"టు ది హెల్త్ ఆఫ్ ది ట్రైన్" అన్నాడు సిగరెట్టుని ఎత్తి గ్లాసులా పట్టుకొని దూరంగావస్తున్న ట్రైనునిచూపిస్తూ. ముప్పావు సిగరెట్టు వుండగానే పారేసి మరోటి అంటించేడు.

"వైరా? వికారవా?" కోప్పడ్డాను.

"అదంతే. విజయవాడ చేరేసరికి యీ పాకెట్ అయి పోవాలి."

ట్రైను చూసిన జనం పొలోమంటూ బస్సెక్కేసేరు. డ్రైవరుమాత్రం దూరంగా చెట్టుకానుకుని నిల్చుని మావైపే చూస్తున్నాడు. ఇంతలో ట్రైను సరిగ్గా గేటుదగ్గరికొచ్చి ఠపీమని ఆగిపోయింది. సిగ్నలు యివ్వలేదుట.

మళ్ళీ గొణిగేడు శీను. ఏవిఁటన్నాను.

"టు ది హెల్త్ ఆఫ్ ది స్టేషన్ మాస్టర్" అన్నాడు యింకో సిగరెట్టుతీస్తూ. మేము బస్సు దిగేలోపల వీడికి పిచ్చెక్కదు కదా.

మరో పావుగంటకి వీడి సిగరెట్లు అయిపోయేయి. రైలూ వెళ్ళిపోయింది. వీడిచేతిలో సిగరెట్టు లేదని రూఢిచేసుకున్నాక డ్రైవరు బస్సెక్కేడు. బస్సుచుట్టూ సోడాలవాళ్లూ, శనక్కాయలవాళ్లూ, జీడిపప్పులవాళ్లూ తెగ అరుస్తున్నారు. బస్సు బయల్దేరబోతోంది.

అంతవరకు ఏంచేస్తోందో కాని, అప్పుడే లేచినట్లు తుళ్ళిపడి "ఏయ్, నాలుగు జీడిపప్పు పొట్లాలియ్యి" అంది డన్లప్ పరువు.

ఆ జీడిపప్పు కుర్రాడికి పది, పన్నెండేళ్ళుంటాయి. మొదటి ఆరేళ్ళు ఎదిగి మరింక ఎదగడం మానేసినట్టువున్నాడు పుట్టినప్పుడు తప్ప మళ్ళీ గరిటెడు నూనె ఎరగనట్టు అతని జుత్తంతా ఎర్రగా రాగిజుత్తులా మెరుస్తోంది. సన్నగా ముల క్కాడల్లాంటి కాళ్ళూ, చేతులూ, పెద్ద గుమ్మడికాయంత బొజ్జ, చిన్న గుమ్మడికాయంత తలతో, తల్లికితప్ప ఎవరికీ ముద్దురానట్టున్నాడు. ఏ అమ్మో కడుపు కరిగి యిచ్చిన నిక్కరులా వుంది. పుట్టగానే అన్ని కోరికలూ చంపుకున్న బాల బైరాగిలా వున్నాడు.

వాడు కిటికీ అంత ఎత్తు ఎగిరి నాలుగు పొట్లాలిచ్చి "బేగి డబ్బులియ్యమ్మా. బండి ఎలిపోతోంది అని 'హార్లాన్' అంటూ బస్సుమీద చేత్తో బాదడం ప్రారంభించేడు. ఏ 'హార్లాన్'కి ఆగాలో బస్సుకి తెలుసు. అది నెమ్మదిగా కదు ల్తోంది. "చిల్లరున్నట్టులేదు" అందావిడ తలగడ అంత హేండ్ బేగ్ తడువుతూ. "డబ్బులమ్మా..." అంటూ వాడా బస్సు పట్టుకొని వేలాడుతూనే వున్నాడు. ఆవిడ చిల్లర లేదంటూనే వుంది. జీడిపప్పు కరిగి యిచ్చే ప్రయత్నంలో లేదు. ఆవిడ యిచ్చునో మానునో కాని యీలోగా పుట్టిన వెంటనే పట్టిన ఆవంధం తప్ప మళ్ళీ ఏం ఎరగనివాడిలా ఆ పొట్లాలన్నీ ఒక్క సారి విప్పేసి ఒళ్ళో పోసుకొని ఆవురావురుమని తినేయడం ప్రారంభించేడు ఆవిడ మొగుడు. అరిగించుకోలేడు కాని లేక పోతే ఆవిడ్నికూడా తినేసేటంత ఆకలిమీదున్నట్టున్నాడు.

"పిడీ బస్సుకింద పడిపోతాడో ఏమిటో" భయంతో గట్టిగానే అన్నాను.

"ఆఁ. ఏం భయంలేదు. వీళ్ళకివి రోజూ అలవాటే" ఎవరో అభయం యిచ్చేరు.

కాని ప్రమాదం ఒక్కరోజే వస్తుంది. ఆ రైల్వే గేటు కోక ప్రత్యేకతవుంది. గేటు కిటు, అటు అరసెంటీమీటరు చోటులేకుండా లారీలు, బస్సులు, కార్లు రెండుమూడు వరసల్లో ఆపేస్తారు. గేటువేసేక ఎవరికీ కదలడానికి అరంగుళం ఖాళీవుండదు. అప్పుడు ఒకడు ఒక అరంగుళం వెనక్కి వెళ్తే మరోడు పావుఅంగుళం ముందుకి జరగలేడు. ఆ మధ్యలోంచి స్కూటర్లు, సైకిళ్ళు వానపాముల్లా పారిపోతాయి. మా బస్సు అంగుళం అంగుళం కదుల్తోంది.

ఆ కుర్రాడు బస్సు పట్టుకొని వేలాడుతూనే వున్నాడు.

ఆవిడ చిల్లర లేదంటూనే వుంది.

ఆ మొగుడు జీడిపప్పు తింటూనే వున్నాడు.

నా ప్రాణాలు పిడికిట్లో గుబగుబలాడుతూ నేవున్నాయి.

ఇంతలో...

ఎదురుగా వస్తున్న బస్సుని తప్పించుకొని ఎక్కడినుండి వచ్చిందో అమ్మవారులా ఓ లారీ ఛాప్షం, ఆ కుర్రాడు పట్టు

తప్పి కిందపడిపోవడం, వాడి ఎముకల పటపటా శబ్దం వినిపించడం ఒక్కసారే జరిగాయి.

కెవ్వున కేకేసాను. కాని శబ్దం రాలేదు.

ఎక్కడ ట్రాఫిక్ అక్కడ బంద్ అయిపోయింది,

అందరూ దిగి చూస్తున్నారు.

అసలిలాటివి చూడ్డానికి మనిషిలో కొంత రాక్షసాంశ వుండాలేమో.

ఎక్కడ భక్తివుంటే అక్కడ దేవుడుంటాట్ట!

ఎక్కడ యాక్సిడెంటైతే అక్కడ పోలీసులుంటారు!

అప్పుడే పోలీసులు లారీ డ్రైవర్ని దింపేసేరు.

"అయినా ఆ గుంటడికంత మొండితనం ఏం! పట్టుకొని వదలడే జలగలాగ" అన్నారొకరు.

"ఏం-ఏం-టో వీడి చావు యిక్కడ రాసివుంది" అన్నాడో వేదాంతి.

"అసలీ లారీ డ్రైవర్లకి ఒళ్ళు తెలీదండి. పట్టపగలే తాగేసి నడుపుతారు" ఒకడు వాపోయేడు, రాత్రి తాగి నడిపితే ఫరవాలేదన్నట్టు.

అంతేకాని వాడికి డబ్బులివ్వకపోవడం ఆవిడ తప్పని ఒక్కరూ అన్లేదు.

కొంతసేపటికి ఆ లారీ తప్ప మిగిలినవి బయల్దేరేయి,

"నయం మన బస్సుకింద పడలేదు. అస్నెస సరీ లేట్,"
అన్నాడు ఫుల్‌సూట్.

చాచి లెంపకాయ కొట్టాలనిపించింది. వాడి ప్రాణం కంటే వీడి బోడిబని ఎక్కువా?

ఆ క్రూరాడ్ని తల్చుకున్న నా మనసంతా అసహ్యంగా అయిపోయింది. వాడికి అమ్మా, నాన్నా వున్నారో లేదో? ఒక వేళ వాళ్ళ సంసారానికి వీడే ఆదరువేమో? వీడి తరవాత వున్న చిన్న తమ్ముళ్ళని, చెల్లెళ్ళని వీడే పోషించాలేమో? మరింక యిప్పుడెవరు దిక్కు వాళ్ళకి.

రోజూ అన్నం టైముకి పరిగెత్తుకొచ్చే కొడుకు ఆ వేళ రాడనీ, ఆ వేళే కాదు శాశ్వతంగా రాడనీ తెలిసిన ఆ తల్లి కడుపుమంట ఎవరార్పగలరు?

బస్సు మళ్ళీ కదిలింది. ★